ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★ సోమవారం 29 జులై 2024



ఘనంగా ఆషాఢ మాసం బోనాలు 8లో..
కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో? 8లో..

'స్థానిక' ఎన్నికలకు సై



- ఓటర్ల జాబితాల తయారీకి ఆదేశాలు
- వచ్చేనెల 2,3 తేదీల్లో ఆపరేటర్లకు శిక్షణ
- అసెంబ్లీ జాబితాలను అనుసరించి తయారీ
- ఆగస్టు, సెప్టెంబరులో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధం అవుతున్నది. అసెంబ్లీ ఓటర్ల జాబితాలను అనుసరించి గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొం దించేందుకు ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఒక్కో జిల్లా నుంచి ఐదుగురు తాత్కాలిక కంప్యూ టర్ ఆపరేటర్లను నియమించుకోవాలని ఆదేశించింది. వారందరికీ వచ్చే నెల 2, 3 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. 2వ తేదీన 15 జిల్లాల వారికి శిక్షణ ఇవ్వనుండగా, అందులో పెద్దపల్లి జిల్లా ఉండడం గమనార్హం. 17 జిల్లాల వారికి ఈనెల 3వ తేదీన శిక్షణ ఇవ్వను న్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం అసెంబ్లీ ఓటర్ల జాబితాలను అనుసరించి పంచాయతీ జాబితాలను రూపొందించ నున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలను అందజేసింది. ఆ జాబితాలను అనుసరించి పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్ కూడా చేయనున్నారు.

రిజర్వేషన్ల విషయమై ప్రభుత్వం ఎటు తేల్చుకోలేక సతమతం అవుతున్నట్లు కనబడుతున్నది. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ, ఎస్టీలు, బీసీల రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. దీంతో గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 27 శాతానికి తగ్గించారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం చేస్తుండగా, బీసీల రిజర్వేషన్లను ఓటర్ల ప్రకారం కేటాయిస్తున్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో 2018లో పంచాయతీరాజ్ నూతన చట్టాన్ని అమల్లోకి తీసుకవచ్చారు. ఆ చట్టం ప్రకారం 5 ఏళ్లు ఉన్న రిజర్వేషన్లను పదేళ్లకు పెంచారు. వాటి ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారా లేకమారుస్తారా అనే విషయం తేలడం లేదు.

● గ్రామాల్లో జోరుగా చర్చలు..

బీసీలు మాత్రం కులగణనను అనుసరించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేయాలనే డిమాండ్ వస్తున్నది. బీసీ గణన పూర్తి కావడానికి చాలా సమయం పడుతుంది. కనసం ఆరు మాసాలైనా పడుతుందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 2వ తేదీ నాటికి ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. ఎన్నికలు జరగక కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతున్నది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోపు పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తే వచ్చే నెలలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు కనబడుతున్నది. ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రైతుల రుణమాఫీ ప్రక్రియ ఆగస్టు 15వ తేదీ నాటికి ముగిసిన తర్వాత, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ప్రభుత్వం యోచిస్తున్నది. పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయడం గానీ, పాత రిజర్వేషన్లను అనుసరించి గానీ ఎన్నికలను నిర్వహించే సూచనలు కనబడుతున్నాయి. దీంతో గ్రామాల్లోని రాజకీయ వర్గాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొడదాం..

- నేటి నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యాకయ్య

గోదావరిఖని, జూలై 28: కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రైవేటీకరణ విధానాల వల్లనే సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులు వేలంపాటలకు బలవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య అన్నారు. సింగరేణి సంస్థను రక్షించుకునేందుకు, కేంద్ర బీజేపీ ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టడానికి సీపీఎం తీసుకున్న కార్యాచరణను యాకయ్య ప్రకటించారు. ఆదివారం గోదావరిఖని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యాకయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 29నుంచి ఆగస్టు 5వరకు సింగరేణి పరిరక్షణ యాత్ర నిర్వహిస్తామని యాకయ్య పేర్కొన్నారు. ఈ యాత్రను బెల్లంపల్లిలో జూలై 29న పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్య ఈ బృందానికి నాయకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. 31న గోదావరిఖనిలో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్జీ-1 పరిధిలోని పలు బొగ్గు గనులపై గేట్ మీటింగ్‌లు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని, సాయంత్రం మెయిన్‌చౌరస్తాలో బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పరిరక్షణ యాత్ర విజయవంతం చేసేందుకు జిల్లావ్యాప్తంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకులు ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, రామాచారి, జ్యోతి, రవీందర్, గణేష్, నర్సయ్య, ఓదెలు, బిక్షపతి, నాగమణి, రాజు, రాజమౌళి, వెంకన్న, గోపాల్, శివ, అనూష, క్రాంతి, కొమురయ్య, కృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రేపు చలో హైదరాబాద్ - జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఖాజా

పెద్దపల్లి రూరల్, జూలై 28 : రాష్ట్రంలోని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా తెలిపారు. ఆదివారం యూనియన్ మండల ఉపాధ్యక్షుడు ముస్తాఫా ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఖాజా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందికి 5లక్షల ప్రమాద బీమాను ప్రభుత్వమే చేయించాలన్నారు. ఈనెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ మండల ప్రధానకార్యదర్శి జంగపల్లి నరేష్, దుర్శేట్టి రాజేశం, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజుల పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై విచారణ

కళ్యాణ్‌నగర్, జూలై 28: గోదావరిఖనిలోని ఓ విద్యా సంస్థలో మహిళా కార్మికులపై లైంగికవేధింపులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన పోలీస్‌శాఖలోని ప్రత్యేక విభాగం ఆదివారం విచారణ చేపట్టింది. మహిళా కార్మికులపై ఒక కీలక ఉద్యోగి కొద్దిరోజులుగా వేధింపులకు పాల్పడుతున్నారనే తీవ్ర ఆరోపణల నేపథ్యంలో పోలీసు శాఖ ప్రత్యేక విభాగం విచారణ చేపట్టింది.

పాఠశాల ఆవరణలో వనమహోత్సవం

మంథనిరూరల్, జూలై 28: మండలంలోని వెంకటాపూర్ బీసీ గురుకుల అశ్రమ పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. నాటి మొక్కలను సంరక్షించాలని, అందరూ మొక్కలు నాటాలని ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు సోనికిరణ్, రాంమ్మూర్తి, మెగా రాజు, ప్రదీప్, పవన్‌కుమార్, సాగర్‌లు పాల్గొన్నారు.

ఆగని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం..



కొత్తపల్లి-పెద్దబొంకూర్‌లో లెవెల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీరు



కొత్తపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచి ఉన్న వరదనీరు



కన్నాల గ్రామశివారులో నీటమునిగిన వరి నాట్లు

పెద్దపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కొనసాగుతూ ఉన్నాయి. ఆదివారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా 31.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయింది. ముత్తారం మండలంలో 45.1 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. అలాగే ఓదెల మండలంలో 39.2మిల్లీమీటర్లు, ఎలిగేడు మండలంలో 37.6 మిల్లీమీటర్లు, పెద్దపల్లి మండలంలో 35.8మిల్లీమీటర్లు, మంథని మండలంలో 35.3 మిల్లీమీటర్లు, సుల్తానాబాద్ మండలంలో 34.3మిల్లీ మీటర్లు, జూలపల్లి మండలంలో 32.6మిల్లీమీటర్లు, కమాన్‌పూర్ మండలంలో 31.9మిల్లీమీటర్లు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 30.6 మిల్లీ మీటర్లు, రామగిరి మండలంలో 30.3 మిల్లీమీటర్లు, ధర్మారం మండలంలో 25.7 మిల్లీమీటర్లు, అంతర్గాం మండలంలో 25.0 మిల్లీ మీటర్లు, రామగుండం మండలంలో 23.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

పెద్దపల్లి రూరల్, జూలై 28 : పెద్దపల్లి మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని వీధులగుండా వరదనీరు ప్రవహిస్తోంది. ఆదివారం మండలంలో వర్షం కురవకపోగా పెద్దబొంకూర్-కొత్తపల్లిలో లెవెల్ బ్రిడ్జిపై వరదనీరు ప్రవహిస్తుండటంతో అధికారులు రెండో రోజు దారిని మూసివేశారు. అలాగే కొత్తపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న అండర్‌బ్రిడ్జిలో పూర్తిగా వరదనీరు ప్రవహిస్తోంది. వరదాలు వస్తున్న దృష్ట్యా ప్రజలెవరు బయటికి రావోద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు.

ఎస్ఆర్ఎస్పీ కాలువకు బంగ

మంథని, జూలై 28: పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనం సతమతమవుతున్నారు. ఆదివారం మండలంలోని కన్నాల గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్పీ కెనాల్ డీ-83కి బుంగ పడటంతో నీళ్ళన్నీన పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వచ్చి చేరుతున్నాయి. కెనాల్‌కు బుంగ పండటంతో గుడిసె గట్టయ్యయాదవ్, రాజయ్య, కుమార్‌లకు చెందిన దాదాపు 10 వరకు వరి పొలం వరద నీరు వచ్చి చేరింది. మూడు రోజుల క్రితమే తాము పొలాల్లో నాటు వేశామని, కెనాల్‌కు బుంగపడి వరద నీరు చేరడంతో నారు మురిగిపోయిందన్నారు. కెనాల్ రిపేర్ చేయించాలని గతంలో చాలా సార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోలేదన్నారు. దెబ్బతిన్న తమ పొలాలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. వర్షాల కారణంగా మండలంలోని విలోచవరం గ్రామంలో ఆదివారం ఉదయం తాటి అనసూర్య ఇల్లు కూలిపో యింది. పాత ఇల్లు కావడంతో వర్షాల కారణంగా కూలిపోయింది. కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తనకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధితురాలు కోరుతుంది.



వెన్నంపల్లి శివారులో వరి పొలాల్లోకి చేరిన వరదనీరు

కాల్వశ్రీరాంపూర్, జూలై 28: అధిక వర్షాల కారణంగా మండలంలోని వెన్నంపల్లి గ్రామ శివారులో జిన్నవానికుంట తెగిపోయింది. దీంతో కుంట ఆయకట్టు పొలాలు నీటిలో మునిగిపోయాయి. ఆ గ్రామంలోని గుర్రాల గండి ప్రాజెక్టు నీరు జిన్నవానికుంటలో కుంటలో అధిక వరదరావడంతో కుంట తెగిపోయింది. దీంతో వరద నీరంతా ఇటీవల వేసిన వరి పొలాలను ముంచెత్తింది. దీంతో సోమవారం 30ఎకరాల వరకు వరదనీటిలో వరి పంటలు మునిగిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తెగిన జిన్నవానికుంట కట్ట మరమ్మతులు చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మదనపడితేనే మంచి కవిత్వం రాయగలం

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మదన పడితేనే మంచి కవిత్వం రాయగలమని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాలువ మల్లయ్య పుట్టినరోజు పండుగ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందసర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో తపన, మదన పడితే తప్ప మంచి కవిత్వం, మంచి కథ రాయలేమన్నారు. పెద్దపల్లిలో సాహిత్య కార్యక్రమాలు ఇంకా విరివిగా జరగాలని కోరారు. అరసం జాతీయ ప్రధానకార్యదర్శి ప్రముఖ కవి వేల్పుల నారాయణ మాట్లాడుతూ కాల్వ మల్లయ్యకు గోదావరిఖనితో అవినాభావ సంబంధం ఉన్నారు. సామాజిక అంశాలను కథా వస్తువులుగా తీసుకొని అనేక కథలు రాశారని, కాల్వ మల్లయ్యతో తన అనుబంధం విడదీయలేనిదన్నారు. బూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలువ మల్లయ్య జీవితమంతా తేలుకుంట, పెద్దపల్లి, ఎఫ్‌సీఐ, గోదావరిఖ ని చుట్టూ అల్లుకుందని, ఆయన ఎక్కడున్నా తన మూలాలను మర్చిపోలేదన్నారు. కవి, రచయిత మంద భాస్కర్ మాట్లాడుతూ పెద్దపల్లిలో సాహిత్య వాతావరణం నెలకొనడానికి కవులు రచయిత లు ముందుకు రావాలని కోరారు. కాలువ మల్లయ్య మాట్లాడుతూ చదువు అంటే తనకు ప్రాణం అని, తాను చదువుకోవడం కోసం చిన్నప్పుడు ఎంతో కష్టపడ్డానని, తాను కథలు రాయడానికి చుట్టూ ఉన్న సామాజిక అంశాలే తనకు ప్రేరణ అని అన్నారు. తాను మరణించేవరకు రాస్తూనే ఉంటానన్నారు. తాను ఉన్నా లేకపోయినా తన రచనలు సమాజానికి ఉపయోగపడతాయని ఆశిస్తున్నానన్నారు. ఈమధ్య లుక్ కల్చర్ బాగా పెరిగిపోయిందని, అందరూ బుక్ కల్చర్‌ని అలవాటు చేసుకోవాలని,అలవాట్లు, ఆలోచన విధానాలు, రచనలు మరణా నంతరం బ్రతికేటట్లు చేస్తాయన్నారు. అనంతరం కవి బాలసాని కొమురయ్య శుభాశంశలు అనే పుస్తకంపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీగురు రవీందర్, ప్రధానకార్యదర్శి జిను కల వెంకటేష్, గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ ఎల్లంకి శ్రీనివాస్, అనాసి జ్యోతి, రవికుమార్, బొజ్జ నరేందర్, రంగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

బస్సు యాత్రను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దపల్లిటౌన్, జూలై 28: తెలంగాణలోని బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించాలని బొగ్గు వేలాన్ని ఆపాలని ఈనెల 29 నుంచి ఆగస్టు 5 వరకు సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను జయప్రదం చేయాలంటూ ఆదివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను వేలం వేస్తున్నదని, దేశ సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిండానికి కుట్ర పన్నుతుందన్నారు. సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును(మంచిర్యాల జిల్లా) కూడా వేలంలో పెట్టిందని. సింగరేణి కూడా ప్రైవేటు సంస్థలతో పోటీ పడాలని ఆనందాన్ని సీపీఎం పార్టీ వ్యతిరేకిస్తున్నదన్నారు. బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాలలో సర్వే చేసి బొగ్గు బ్లాకులను గుర్తించి ఉత్పత్తి చేస్తున్నదని, సహజంగానే శ్రావణపల్లిలో కూడా సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీపెల్లి రవీందర్, జీ జ్యోతి, కల్లెపల్లి అశోక్, నాయకులు జిల్లాల ప్రశాంత్, మొదుంపల్లి శ్రావణ్, నవీన్, వినయ్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రు. 13 కోట్ల రోడ్ల నిర్మాణ పనులు రద్దు

● టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ దశలో నిలిపివేత
● మళ్లీ మంజూరు వచ్చేనా?
● వానాకాలంలో తప్పని కష్టాలు

కథలాపూర్, జూలై 28: గత సర్కారు పల్లె రోడ్లను మెరుగు పరచాలనే ఉద్దేశంతో మంజూరు చేసిన పనులు రద్దు కావడంతో గ్రామీణ జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తరబడి ఎదరుచూస్తున్న క్రమంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని వివిధ గ్రామాలను కలిపే రోడ్లకు నిధులు వెచ్చించింది. కాగా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు ఈ పనులను రద్దు చేయడంతో మళ్లీ నిధులు కేటాయిస్తారా అనే సందేహం వ్యక్తమవుతోంది.

● టెండర్లు పూర్తయినా...

మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వాన్నంగా మారగా స్థానిక ప్రజాప్రతినిధులు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తేవడంతో సుమారు 13 కోట్ల నిధులు కేటాయించారు. భూషణరావుపేట-కథలాపూర్ డబుల్ రోడ్డుకు రు. 6 కోట్లు, చింతకుంట వయా గుంటి పెరమాళ్ళ నుంచి కథలాపూర్‌కు రు. 2 కోట్లు, భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు రు. 2 కోట్లు, దూలూరు నుంచి పోసానిపేట రోడ్డుకు రూ. 3 కోట్ల చొప్పున అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ రోడ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పాటు అగ్రిమెంట్ దశకు చేరుకోగా ఈ పనులను రద్దు చేసినట్టు తెలిసింది. ఎప్పటి నుంచో ఎదిరి చూస్తున్న భూషణరావుపేట-కథలాపూర్ రోడ్డు డబుల్ రోడ్డుగా మారుతుందని ఆశించినా నిష్ప్రయోజన మే అయింది. కాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక ఈ రోడ్ల నిర్మాణ పనులు ఎందుకు రద్దు చేశారనేది ప్రశ్నార్థకంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో నరక ప్రయాణంగా ఉంది.



భూషణరావుపేట - కథలాపూర్ రోడ్డు

● నిధులు మళ్లీ మంజూరు చేయాలని కోరాం

- నాగం భూమయ్య, మాజీ జడ్పీటీసీ



మంజూరైన రోడ్ల నిధులను రద్దు చేయడం వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉంది. అనేక సార్లు ఈ రోడ్లకు నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వం దృష్టికి తెచ్చి మంజూరు చేయించాం. కాంట్రాక్టర్లు కూడా టెండర్లు వేసి పనులు చేపట్టడానికి ముందుకు వచ్చినా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు అవస్థలు తప్పలేవు. జనం పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తెచ్చాము. సానకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు.

భూమి ద్వారానే దళితులకు సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

సిరిసిల్ల టౌన్, జూలై 28: భూమి ద్వారానే దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందని ఓయూ ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో మంద సుదర్శన్ అధ్యక్షతన 'దళితులు- సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడారు. భారత సమాజంలో మనుషులకు కులం ద్వారానే గుర్తింపు ఉంటుందన్నారు. దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దళిత ప్రజలు విస్తరించి ఉన్నారని, ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం దేశంలో 22 శాతం ఉన్నారని అన్నారు. వారి చేతుల్లో భూములు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని సంవత్సరాలుగా భూ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు.

ఉద్యమాలతో సాధించుకున్న కొందరు దళితులు మాత్రమే భూములను సాగు చేసుకొని జీవించారన్నారు. గత ప్రభుత్వం దళితులు సాగు చేసుకున్న భూములను అభివృద్ధి పేరిట బలవంతంగా లాగేసుకుందని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే దాదాపు 2120 ఎకరాల సాగు భూమిని దళితుల నుంచి దొరలు, భూస్వాములు ధరణి పేరుతో లాక్కున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాడు దళిత జాతి ప్రజల కోసం రాజకీయ హక్కులను సాధించారని, ఓటు హక్కుతోపాటు చట్ట సభలో దళిత ప్రజలు ప్రాతినిధ్యం వహించేందుకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. గత ప్రభుత్వం దళితుల నుంచి లాక్కున్న భూములను తిరిగి ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నేరెళ్ల బాధితులకు న్యాయం జరగలేదని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ న్యాయం చేయాలని కోరారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు అంకని భాను, మాజీ జడ్పీటీసీ గొట్టె రుక్మిణి, నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల తయారీపై సీఎం వ్యాఖ్యలు సరికాదు



దీక్షలో పాల్గొన్న నేతన్నలు

సిరిసిల్ల రూరల్, జూలై 28: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేయించకుండా గుజరాత్‌లోని సూరత్ నుంచి కొనుగోలు చేసి తెచ్చిందంటూ అసెంబ్లీలో నేతన్నలను అవమాన పరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలేదీక్షలు ఆదివారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలు సంక్షోభంలో కూరుకపోయి ఏడు నెలలవుతోందని, పరిశ్రమలపై ఆధారపడినవారికి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులు అత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఐదేళ్ల నుంచి ప్రభుత్వంపై ఆధారపడే వస్త్ర పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొన సాగించిన పథకాలను నిలిపివేయడం ఎంతవరకు సమంజమన్నారు.

సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తి జరిగిందా? లేదా? అనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. బతుకమ్మచీరల తయారీలో అవినీతి జరిగితే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉత్పత్తి చేసిన నేతన్నల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని, వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను యజమానుల, ఆసాములు, కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం దీక్షలో వైపని గౌరవ అధ్యక్షుడు ఒగ్గు గణేష్, ఆసాముల సంఘం ఉపాధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త వెంగళ అంకయ్య, అంబటి రవీందర్, సందుపట్ల పోచమల్లు, తాటికొండ శ్రీనివాస్, బూర అంబరీషం కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్, గోవిందు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.730 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పైనుంచి 20,643 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌లో నుంచి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో వర్షాలు కొనసాగుతూ ఉన్నాయి. ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 31.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వర్షాలకు చెరువులు కుంటలు నిండిపోగా, మానేరు హుస్సేనిమియా వాగులు ఉప్పొంగుతున్నాయి.

● 'గాయత్రి' నుంచి 12,600 క్యూసెక్కుల నీరు..



గాయత్రి పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి ఎస్సారెస్పీ మిడ్ మానేరుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం నాలుగు పంపుల ద్వారా విడుదల చేసిన నీటిని ఆదివారం కూడా అధికారులు కొనసాగించారు. ప్రస్తుతం 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలివెళ్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి ప్రవాహం కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. నాలుగు బహుబలి పంపులతో 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు రెండో రోజు కూడా కొనసాగించారు. కాగా గ్రావిటీ కెనాల్‌లో నీరు నిండుగా ప్రవహించడంతో రైతుల కళ్లల్లో ఆనందం కదలాడుతోంది.

● ఉధృతంగా ప్రవహిస్తున్న వరద కాలువ..



కురిక్యాల వద్ద ఉధృతంగా పారుతున్న వరద కాలువ

గంగాధర: వరద కాలువ ఎల్లంపల్లి నీటితో ఉధృతంగా పారుతోంది. రామడుగు మండలం లక్ష్మీపూర్ పంపుహౌస్ నుంచి అధికారులు నాలుగు మోటర్లు ప్రారంభించారు. ఒక్కొక్క పంపు నుంచి 3,150 క్యూసెక్కుల నీరును అధికారులు విడుదల చేయగా ఇప్పటివరకు ఒక్క టీఎంసీ నీరు మిడ్ మానేరుకు చేరినట్లు గంగాధర మండల పరిధిలో కాలువను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్శకుర్తి, ఆచంపల్లి గ్రామాల్లో వరద కాలువ అంచులను తాకుతూ ఎల్లంపల్లి నీరు దిగువకు వెళుతోంది. వరద కాలువకు నీరు విడుదల చేయడంతో గంగాధర మండల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మల్యాల: ఎల్లంపల్లి నీటితో వరదకాలువ నిండుగా మారి జలకళను సంతరించుకుంది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి రెండురోజులుగా మిడ్‌మానేరుకు వరదకాలువ ద్వారా నీటిని విడుదల చేయగా వరదకాలువ 102కి.మీ వద్ద గల షానగర్ క్రాస్‌రెగ్యులేటర్ నుంచి రాంపూర్ పంప్‌హౌజ్ వైపు కూడా కొంత మేర నీరు వస్తుంది. దీనికి తోడు మిడ్‌మానేరు వద్ద కూడా నీరు పూర్తిస్థాయికి చేరుకుంటుండడంతో ఎగువకు ఎల్లంపల్లి జలాలు ఎగబాకుతున్నాయి. దీంతో రాంపూర్ పంప్‌హౌజ్ వద్దకు ఆదివారం ఉదయం వరకే వరదకాలువలో నీరు సమృద్ధిగా చేరుకున్నాయి. రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద గేట్లు వేసి ఉండడంతో నీరు ఇక్కడి వరకు నిలిచి ఉన్నాయి. వరదకాలువలోకి నీరు చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే మిడ్‌మానేరు నిండిన తరువాత శ్రీరాంసాగర్ వరకు నీటిని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి వరదకాలువకు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

● మిడ్‌మానేరుకు 12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: బోయినపల్లి మండలంలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి ఎల్లంపల్లి గ్రాయత్రి పంప్‌హౌజ్ ద్వారా 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్‌లో పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను 306.36 ఉండగా నీటి నిల్ల సామర్థ్యం 27.50 టీఎంసీలకు గాను 6.66 టీఎంసీల నీరు ఉంది.



మూలవాగులో కలుస్తున్న వరద కాలువ నీరు

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి వరద



ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, జూలై 28: ధర్మపురి వద్ద గోదావరి నది ఆదివారం ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. దీనికి తోడుగా కడెం ప్రాజెక్టు నుంచి 4,682 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలయ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

బస్సు కిందకు దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

● ఇద్దరు యువకులకు గాయాలు



బస్సు కింద ఇరుక్కున్న ద్విచక్రవాహనం

మల్యాల, జూలై 28: ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెలుతుండగా అదుపుతప్పి ఆర్టీసీ బస్సుకింద పడడంతో స్కూటీని వదిలి పక్కకు దూకడంతో యువకులు గాయాల పాలు కాగా స్కూటీ బస్సు కింద కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల-కరీంనగర్ రహదారి మార్గంలోని వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల వద్ద జగిత్యాల నుంచి కొడిమ్యాలకు స్కూటీపై వెలుతున్న ఇద్దరు యువకులు ముందు గల కారును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న నిర్మల్ ఆర్టీసీ బస్సును గమనించలేదు. అయితే యువకులు చాకచక్యంగా ద్విచక్రవాహనం వదిలి పక్కకు దూకగా స్కూటీ వాహనం ఆర్టీసీ బస్సు కింద పడింది. ఆర్టీసీ బస్సు కింద పడడంతో స్కూటీని లాక్కెల్లింది. అయితే త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పగా గాయపడిన యువకులును చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని యువకుడి ఆత్మహత్య



వాసుదేవరెడ్డి(ఫైల్)

జనగామ రూరల్, జూలై 28: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న యువకుడిని జనగామ రైల్వే పోలీసులు గుర్తించారు. ముందుగా గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు రైల్వే పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన ఏనుగు వాసుదేవరెడ్డి(19) మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో బీటెక్ చదువుతు న్నాడు. ఫస్ట్ ఇయర్‌లో కొన్ని సబ్జెక్ట్‌లు ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

టీర్‌పూర్. జూలై 28: మండలంలోని తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన పొన్నం భూమన్నగౌడ్ ఆదివారం కొల్వాయి శివార్లలోని తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీదనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయానికి కొల్వాయి గ్రామంలో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గాయపడ్డా భూమన్న గౌడ్‌ను పరామర్శించి 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మర్రిపల్లి తిరుపతి అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడగా అతని గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గాయపడ్డ తిరుపతిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ కరువు

- అత్యాచారాలు, హత్యలపై పోరాటానికి సిద్ధం కావాలి - పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

కళ్యాణ్‌నగర్, జూలై 28: బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన పీవోడబ్ల్యూ ఏడో మహాసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమ భాగస్వామ్యం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై హింస, మతోన్మాదం పెరిగిందని, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. బిల్కిస్ భానుపై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని బీజేపీ సన్మానించిందని విమర్శించారు. దేశంలో రాజ్యాంగానికి విరుద్ధంగా సీఏఏ, ఎన్‌ఆర్‌సీ పౌర చట్టాలను తీసుకువచ్చి మతోన్మాదంతో వ్యవహరిస్తుందన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస చట్టాల కోసం పీవోడబ్ల్యూ బలమైన పోరాటం చేస్తుందని, మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చేసినా అది అమలు కావడం లేదని ఆరోపించారు. హక్కుల కోసం మహిళలు పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి మంగ మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించగలుగుతామన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధిలో ఉన్నా పని ప్రదేశాల్లో లైంగిక దాడులను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

● ర్యాలీ నిర్వహించిన మహిళలు..

పీవోడబ్ల్యూ మహాసభ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు కే జ్యోతి ఆధ్వర్యంలో ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి లక్ష్మీనగర్, అశోక్‌నగర్ మీదుగా ఐఎఫ్‌టీయూ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో జెండా ఆవిష్కరించి సభలను నిర్వహించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాళ్లు బుచ్చమ్మ, మంగ, రజిత, అమృత, సరోజన, శారద, స్వర్ణలత, స్వప్న, పద్మ, సత్తెమ్మ, ఐ కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 20,370 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,370 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 32.657 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 72.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 624 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 26.805 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.408 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

హుజూరాబాద్, జూలై 28: హుజూరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక నివేదికలు చదివి వినిపించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సభ్యులు సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్‌పాషా, ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ గోపాల్‌రావు, కోశాధికారి దుర్గాజీ, కొంరెల్లి, సత్యనారాయణ, గణపతిరెడ్డి, చారుదత్తు, రవీందర్, కాంతమ్మ, జయవర్ధన్, లక్ష్మీనారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో భర్తీకి నోచుకోని సింగరేణి కోటా సీట్లు

● ఉద్యోగుల పిల్లలు అనాసక్తి

● ప్రత్యామ్నాయ మార్గం లేక మిగిలిపోతున్న సీట్లు

● పదేళ్లుగా ఇదే తంతు - పట్టించుకోని అధికారులు

● సింగరేణి ప్రభావిత గ్రామాల విద్యార్థులకు చోటు కల్పించాలని డిమాండ్



రామగిరి, జూలై 28: సింగరేణి నిధులతో నిర్మాణం జరిగిన మంథని జేఎన్టీయూలో సింగరేణి కోటాలో కేటాయించిన ఇంజనీరింగ్ సీట్లు భర్తీకి నోచుకోవడం లేదు. జేఎన్టీయూ కళాశాల నిర్మాణానికి పూర్తి సహకారం అందించిన సింగరేణి సంస్థకు జేఎన్టీయూ ఇంజనీరింగ్ సీట్లలో ఐదు శాతం సీట్లు సంస్థ ఉద్యోగులకు కేటాయించింది. అందులో భాగంగా ఆరు బ్యాచ్‌లు కల్గిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సూపర్ న్యూమరరీ కోటా కింద 18 సీట్లు ఉద్యోగుల పిల్లలకు అవకాశం కల్పించింది. కాగా 2021-22 వరకు ఐదు శాతం ఉన్న కోటాను 2022-23 విద్యా సంవత్సరానికి 10 శాతం పెంచింది. దాంతో ఇప్పటి వరకు 18గా ఉన్నా సీట్ల సంఖ్య 36కు పెరిగింది. కానీ పెరిగిన సంఖ్యకు అనుగుణంగా సింగరేణి ఉద్యోగుల పిల్లల నుంచి ఆశించిన మేర దరఖాస్తులు రావడం లేదు. దీంతో గడిచిన పదేళ్లుగా సూపర్ న్యూమరరీ సీట్లు మిగిలి పోతూనే ఉన్నాయి. ఇక నాలుగు సంవత్సరాల కౌన్సెలింగ్ వివరాలను పరిశీలిస్తే 2021-22లో సివిల్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానికల్, సీఎస్‌ఈ, మైనింగ్, సీఎస్‌ఈ(ఏఐ) విభాగాల ఒక్కో విభాగానికి మూడు సీట్లా చొప్పున 18 సీట్లు కేటాయించగా 13 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఐదు సీట్లు ఖాళీగానే ఉండిపోయాయి. అదేవిధంగా 2022-23 విద్యాసంవత్సరంలో కోటాను 10శాతానికి పెంచగా ఒక్కో విభాగంలో ఆరు సీట్ల చొప్పున 36 సీట్లు కేటాయించగా అందులో 26 సీట్లలో విద్యార్థులు చేరగా 10 సీట్లు మిగిలిపోయాయి. 2023-24 విద్యాసంవత్సరానికి గాను కేవలం 12 మంది విద్యార్థులు మాత్రమే సీట్లను ఎంపిక చేసుకోవడంతో 24 సీట్లు అలాగే ఉండిపోయాయి. ఇక ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి 36 సీట్లకు గాను 11 సీట్లు మాత్రమే విద్యార్థులు ఎంపిక చేసుకోగా 25 సీట్లు మిగిలిపోయాయి. సింగరేణి కోటా సూపర్ న్యూమరరీలో 36 సీట్లకు గాను 18 సీట్లు అధికారుల పిల్లలకు, 18 సీట్లు కార్మికుల పిల్లలకు కేటాయించగా ప్రస్తుతం అధికారుల పిల్లలు కేవలం తొమ్మిది మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా కార్మికుల పిల్లలు 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అధికారుల పిల్లలు ఇద్దరు, కార్మికుల పిల్లలు తొమ్మిది మంది కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లను భర్తీ చేయగా 25 సీట్లు మిగిలిపోయాయి. తిరిగి రెండో కౌన్సెలింగ్ నిర్వహించినా ఇదే అధికారుల పిల్లలు, కార్మికుల పిల్లలు 36 మందిలో భర్తీ అయిన 11 మంది పోనూ మిగతా 25 మందిలో నుంచే కౌన్సెలింగ్‌కు హాజరు కావల్సి ఉంటుంది. అందులో నుంచి ఇప్పటికే వివిధ కళాశాలలో చేరి ఉండడంతో ఆ 25 సీట్లు మిగిలి పోయే అవకాశం ఉంది.

● ప్రభావిత గ్రామాల విద్యార్థులకు కేటాయించాలి..

మంథని జేఎన్టీయూ కళాశాలలో పది సంవత్సరాలుగా బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోతున్న సూపర్ న్యూమరరీ సింగరేణి కోటా సీట్లలో ప్రభావిత గ్రామాల విద్యార్థులకు అవకాశం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది. సంస్థ కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా ఉంటూ తమ భూములను దారాదత్తం చేసిన తమకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో సింగరేణి విఫలం అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలలో బ్యాక్‌లాగ్‌లుగా మిగులుతున్న సీట్ల విషయంలోనైనా శ్రద్ధ వహించి ప్రభావిత గ్రామాలకు చెందిన విద్యార్థులకు జేఎన్టీయూలో అవకాశం కల్పించి సింగరేణి కోటాలో ప్రభావిత గ్రామాల విద్యార్థులను చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

● యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం..

గడిచిన పదేళ్లుగా సింగరేణి కోటా సీట్లు ప్రతి సంవత్సరం మిగిలిపోతున్న దానికి ప్రత్యామ్నయ మర్గాలు అన్వేషించకుండా వర్సిటి అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారు. సూపర్ న్యూమరరీ కోటాలో మిగిలిపోయిన సీట్లను బ్యాక్‌లాగ్‌లుగా వదిలివేయకుండా జనరల్ కౌన్సిలింగ్‌లో చేర్చినట్లైయితే సామాన్య విద్యార్థులకు లబ్ధి జరిగే అవకాశం ఉంది. దీనికి ప్రత్యేకమైన జీవోలు కాని ప్రభుత్వం నుండి అనుమతులు కాని అవసరం లేకున్నా కేవలం వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రతిష్టాత్మకమైన కళాశాలలో సీట్లు బ్యాక్‌లాగ్ గానే మిగిలిపోతున్నాయి.

ఆడుకుంటూ అనంత లోకాలకు..

- నీటి సంపులో పడి చిన్నారి మృతి

- గాజులపల్లిలో విషాదం



శ్రేయాన్స్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 28: ఇంటిలో సందడి చేసే ఓ పసివాడి చిరునవ్వులు అర్థాంతరంగా ఆగిపోయాయి.. అమ్మా అంటూ తప్పటడుగులు వేస్తూ ఇళ్లంతా కలియతిరిగే చిన్నారి అడుగులు నిలిచిపోయాయి. ఆడుకుంటూ వెళ్లిన ఆ చిన్నారిని విధి అక్కున చేర్చుకుంది. ఇంటి ఎదుట ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మూడేళ్ల చిన్నారి పెద్దోళ్ల శ్రేయాన్స్ మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపల్లిలో ఆదివారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని పెద్దోళ్ల అనూష -కిషన్ దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు శ్రేయాన్స్ ఉన్నారు. అనూష-కిషన్ దంపతులు వ్యవసాయం చేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. ఆదివారం సాయంత్రం తల్లి అనూష ఇంటిలో వంట పని చేస్తే, తండ్రి కిషన్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పిల్లలు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు శ్రేయాన్స్ నీటి సంపులో పడిపోయాడు. కొడుకు కనిపించడం లేదని తల్లి ఇంటితో పాటు ఆరు బయట గాలించింది. అనంతరం తాగు నీటి సంపులో విగత జీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. విషయం తెలుసుకున్న తండ్రి కిషన్ చేరుకుని సంపులో నుంచి శ్రేయాన్స్‌ను బయటకు తీసి హుటాహుటిన సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి చనిపోయాడని నిర్ధారించారు. కన్న కొడుకు అర్థాంతరంగా మృతి చెందడంతో గుండెలవిసేలా రోదించారు. అయ్యో కొడుకు అప్పుడే నూరేళ్లు నిండాయా..? అంటూ తల్లి అనూష కంటతడి పెట్టడం అక్కడున్న పలువురు హృదయాలను కదిలించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నామని వివరించారు.

కొడుకు మృతిని తట్టుకోలేక.. తల్లి మృత్యువాత

- 15 రోజుల వ్యవధిలో తల్లీకొడుకు మృతి

మల్యాల, జూలై 28: కొడుకు మృతిని తట్టుకోలేని ఆ తల్లి తనయున్నే తలచుకుంటూ మృత్యువాతపడింది. ఈ విషాదకరమైన సంఘటన మల్యాల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. మల్యాలలోని బీసీ కాలనీకి చెందిన బెక్కం లక్ష్మణ్(24)అనే యువకుడు ఈ నెల 14 మొహర్రం వేడుకల్లో భాగంగా పులివేషధారణ వేసి తోటి మిత్రులతో వేడుకల్లో ఉండగానే అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి కొడుకు మృతిని తలచుకుంటూ తల్లి లక్ష్మి(50) మదనపడుతోంది. ఆ బాధ నుంచి తేరుకోలేక ఆదివారం లక్ష్మి కూడా మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. 15 రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలోని తల్లి, కొడుకులు మృతి చెందడం స్థానికంగా కలచివేస్తోంది.

● ఎమ్మెల్యే ఆర్థిక సాయం..

బెక్కం లక్ష్మి ఆదివారం మృతి చెందడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పంపించిన ఐదు వేల రూపాయ లను అందజేశారు. మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మన్, ఆగంతపు వంశీ, శనిగారపు తిరుపతి, ప్రతాప్, హరినాథ్, ప్రశాంత్, ఇమామ్ ఉన్నారు

ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని.. యువకుడి బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కథలాపూర్, జూలై 28: తాను ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందనే మనస్తాపానికి గురైన మాడవేని తిరుమలేశ్ (19) అనే యువకుడు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... మండలంలోని సిరికొండకు చెందిన తిరుమలేశ్ కోరుట్లలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అక్కడే ఓ యువతితో ప్రేమలో పడగా ఆమె వివాహం చేసుకోడానికి నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుమలేశ్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆదివారం సిరికొండ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. శవాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపి మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లికి ఆర్థిక ఇబ్బందులతో యువతి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 28: పెళ్లికి అవసరమైన డబ్బులకు తల్లి, సోదరుడు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసి మనస్తాపానికి గురై కరీంనగర్‌లోని బోయవాడలో కోహూరి ధరణి(21) అనే యువతి శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ధరణికి తండ్రి లేడు. తల్లి, సోదరులు ఆమెకు వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఒక యువకుడితో మూడు నెలల కిందట నిశ్చితార్థమైంది. అయితే పెళ్లి ఖర్చులకు కావాల్సిన డబ్బుల సర్దుబాటుకు ఇబ్బందికరంగా ఉందని తల్లి, కొడుకులు బాధపడుతున్న విషయం తెలుసుకున్న ధరణి ఇంటిలో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

పెళ్లి ఖర్చుల డబ్బులు, ఏర్పాట్ల పనుల నిమిత్తం ధరణి తల్లి, సోదరుడు శనివారం ఉదయం పెద్దపల్లికి బంధువు ఇంటికి వెళ్లారు. రాత్రి ధరణికి తల్లి ఫోన్ చేయగా స్పందించక పోవటంతో వెంటనే సమీపంలో ఉన్న ధరణి స్నేహితురాలిని వెళ్లి చూడమన్నారు. ఆమె వెళ్లేసరికి ధరణి ఉరికి వేళాడుతూ కనిపించింది. స్థానికులు ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందిందని వెల్లడించారు. పెళ్లికి డబ్బులు సర్దుబాటు అవ టం లేదని మనస్తాపంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి మాలతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 28: కరీంనగర్ బైపాస్‌రోడ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దొంతినేని అభినయ్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన అభినయ్ నాలుగేళ్లుగా కరీంనగర్‌లోని కాపువాడలో అద్దె గదిలో ఉంటూ ఒక కారు షోరూంలో టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో దాబాలో భోజనం చేసేందుకు బద్దం ఎల్లారెడ్డి విగ్రహం వద్ద నుంచి బైపాస్‌రోడ్‌లో తీగలవంతెన వైపు తన బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వర్షం కారణంగా, అతివేగంగా బైక్ నడపటంతో ఎల్‌పీజీ గ్యాస్ బంక్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా అభినయ్ స్ట్రీట్‌లైట్ పోల్‌కు ఢీకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు..

రాయికల్, జూలై 28: రాయికల్ పట్టణంలోని అల్లెపు రాజశేఖర్(30) అనే వ్యక్తి ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ తన భార్యతో గొడవ పడగా భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన రాజశేఖర్ పట్టణ శివారులోని మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న అల్లెపు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఘనంగా ఆషాఢ మాసం బోనాలు


బోనం ఎత్తుకొని వెళుతున్న కందుల సంధ్యారాణి తదితరులు


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న కార్పొరేటర్, మహిళలు


ఎన్టీపీసీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలతో మహిళలు

కోల్‌సిటీటౌన్, జూలై 28: ఆషాఢ మాసం సందర్భంగా గోదావరిఖని గంగానగర్‌లో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి బోనాల వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రామగుండం ఇన్‌చార్జీ కందుల సంధ్యారాణి, సింగర్ కనుకవ్వ ముదిరాజ్‌లు హాజరై కుల సంఘం మహిళలతో కలిసి బోనమెత్తుకున్నారు. పెద్ద ఎత్తున బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆటా, పాటలతో సందడి చేస్తూ పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకోగా ఆలయ కమిటీ ఛైర్మన్ సబ్బు మల్లయ్య ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ రామగుండం ప్రజలకు అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని, ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ కందుల సంధ్యారాణి-పోశం దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జంగపెల్లి సరోజన, అనవేని సంధ్యారాణి, మల్లయ్య, పిట్టల ఇస్తారి, కొలకని సాంబయ్య, రావుల స్వరాజ్, పిట్టల శంకరయ్య, దండు రవి, ఆషావేని రాజయ్య, పాసవేని రాజన్న, రాజశేఖర్, బోళ్ల లక్ష్మీనారాయణ, జంగపెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, జూలై 28: ఆషాఢ మాసం సందర్భంగా గోదావరిఖనిలో సోమవారం ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మేదరి బస్తీ నుంచి అమ్మవారి బోనాలతో గోదావరిఖని చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో ఘనంగా అమ్మవారి బోనాలను నెత్తిన పెట్టి నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసంలో దేవి తన పుట్టింటికి వెళుతుందని, అందుకే ఈ భక్తులు ఈ ఆషాఢంలో దేవిని దర్శించుకుంటారన్నారు. ఈ బోనాల్లో ఆడపు దశరథం, కీర్తినాగరాజుతో పాటు మహిళలు పాల్గొన్నారు.


బోనాల పండుగలో పోతరాజుల విన్యాసాలు

జ్యోతినగర్, జులై 28 : ఎన్టీపీసీ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. గౌడ కుల మహిళలు తలపై బోనాలతో మేడిపల్లి సెంటరు నుంచి అన్నపూర్ణకాలనీ ఆలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాల ర్యాలీ కొనసాగింది. అనంతరం ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గౌడ కుల సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూలై 28: ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు పోచమ్మ తల్లికి బోనాల పండుగ నిర్వహించుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు కులాలకు చెందిన వారు సామూహికంగా తమ కుటుంబ సభ్యులతో బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు తమ ఇంటి బోనాలను తమ చిన్నారులతో కలిసి వారి తలపై పెట్టించి పోచమ్మ ఆలయాలకు బయలుదేరారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో కూడా పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు.

వైభవంగా మడేలయ్య ఉత్సవాలు

మంథని, జూలై 28: పట్టణంలోని రజకులంతా స్థానిక బొక్కలవాగులో తమ కులదైవమైన శ్రీమడేలయ్య ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమ నివాసాల నుంచి డప్పుల చప్పుళ్లతో సామూహిక బోనాలతో ఊరేగింపుగా తరలి వెళ్ళి శ్రీమడేలయ్య, కట్ట మైసమ్మ, పెద్దపోచమ్మ, పోచక్క తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నేతలుపైడాకుల నాగరాజు, పోతరాజు శ్రీనివాస్, వెంకటేష్, కొల్లూరి సమ్మయ్య, రమేష్, చంద్రగిరి శ్రీనివాస్, రజకులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో వనమహోత్సం

మంథనిరూరల్, జూలై 28: మండలంలోని వెంకటాపూర్ బీసీ గురుకుల ఆశ్రమ పాఠశాల ఆవరణలో వన మహోత్సంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. నాటి మొక్కలను సంరక్షించాలని, అందరూ మొక్కలు నాటాలని ఎఫ్ఆర్వో శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు సోనికిరణ్, రామ్మూర్తి, మెగా రాజు, ప్రదీప్, పవన్‌కుమార్, సాగర్‌లు పాల్గొన్నారు.

వనమహోత్సవం లక్ష్యానికి తూట్లు..


కొత్తపల్లిలో వృథాగా పడేసిన మొక్కలు

పెద్దపల్లి రూరల్, జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమం లక్ష్యానికి పెద్దపల్లి మండలంలో తూట్లు పడుతోంది. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటగా, మిగిలిన మొక్కలను రోడ్డుపక్కన వృథాగాపడేశారు. మొక్కలు నాటిన తర్వాత మిగిలిన వాటిని వేరే ప్రాంతాల్లో నాటాల్సి ఉండగా వృథాగా పడేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం డ్రైవర్ల ఆందోళన


సమావేశంలో పాల్గొన్న లారీ డ్రైవర్లు, కార్మిక సంఘ నేతలు

సుల్తానాబాద్, జూలై 28: సుల్తానాబాద్ ప్రాంతంలోని రైస్‌మిల్లుల్లోని లారీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి ఆందోళన చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వేల్పుల కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావులు స్పష్టం చేశారు. ఆదివారం సుల్తానాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ లారీడ్రైవర్ల వేతనాలు పెంచి, సమస్యలు పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైసు మిల్లు యజమానుల వైఖరికి నిరసనగా సోమవారం నుంచి వివిధ పద్ధతుల ద్వారా నిరసనలు తెలుపనున్నట్లు వివరించారు. అనేక సంవత్సరాలుగా సుల్తానాబాద్ రైసు మిల్లుల్లో చాలీచాలని జీతాలతో డ్రైవర్లు పని చేస్తున్నారని, కుటుంబాలను పోషించుకోలేకపోతున్నారన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, పోగుల తిరుపతి, జంగం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు


ట్రాక్టర్‌తో జంబు కొడుతున్న రైతు


నాట్లు వేస్తున్న కూలీలు

మంథని, జూలై 28: మంథని డివిజన్‌లో పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీగా మారారు. ఈ సీజన్‌లో ఆలస్యంగానైనా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలు, గుండారం రిజర్వాయర్, శ్రీపాద ఎల్లంపల్లి, పార్వతి బ్యారేజీ, గోదావరి, మానేరు నదులతోపాటు వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో డివిజన్‌లోని మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి మండలాల్లోని రైతు కుటుంబాలు పొలాలు, చేన్లలో వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వర్షాలు కొంతమేర ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుపై రైతులకు ఆశలు మొదలయ్యాయి. రైతులు, రైతుకూలీలు పొలాల్లో వరినాట్లు వేయడం, జంబుకొట్టడం, నారు అలకడం పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఎరువులను సమకూర్చుకుంటున్నారు. ఖరీఫ్‌లో రైతులు పత్తి, వరి పంటలతో పాటు పప్పు ధాన్యాలైన పెసర, మినుము, కంది, సోయలు, మొక్కజొన్న, మిర్చి, కూరగాయలను సాగు చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలను, ఎరువులను సేకరించుకుంటున్నారు. దీనికి తగినవిధంగా ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బోర్ల కింద వరి సాగు చేసే రైతులు ఇప్పటికై నాట్లు వేసే ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. వారంక్రితం వరకు ఎండల తీవ్రత కారణంగా కొంత మేరకు పత్తి విత్తనాలు, మొకలు దెబ్బతినగా ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి చేన్లలకు ప్రాణం పోసినట్లు కావడంతో పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎండలతో దెబ్బతిన్న చేన్లలో మళ్లీ పత్తి విత్తనాలు నాటేందుకు కొందరు రైతులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సాగు రైతాంగం ఆశించినట్లుగా ముందుకు సాగాలని అందరు కోరుకుంటున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- ఐదేళ్లు దాటినా పిల్లర్లకే పరిమితం.. - పట్టించుకునే వారు కరువు..


గుడిపల్లిలో పిల్లర్లకే పరిమితమైన కమ్యూనిటీ హాల్ భవనం

పాలకుర్తి, జూలై 28: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణ పనులు నత్తన నడుస్తున్నాయనే పలు విమర్శలు ఇప్పటికే వెల్లువెత్తున్నాయి. దీనికి తోడు కమ్యూనిటీ హాళ్ల భవన నిర్మాణ పనులు సైతం చాలా గ్రామాల్లో పిల్లర్లకే పరిమితమైనా పట్టించుకునే కరువయ్యారు. మండల పరిధిలోని గుడిపల్లిలో 2018-2019 సంవత్సరానికి డీఎంఎఫ్‌టీ నిధులు 30 లక్షలతో బోడగుట్ట సమీపంలో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. టీఎస్‌డబ్ల్యూ ఐటీసీ అధికారులు నిర్వహించిన టెండర్లలో పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టరు ఐదు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు పూర్తి చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిం చి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాల్ పనులను త్వరగా పూర్తిచేస్తాం

- టీఎస్‌డబ్ల్యూ ఐటీసీ ఏఈ నరేష్

పాలకుర్తి మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ భవనం పనులు కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్లనే జాప్యం జరుగుతోంది.. పనుల్లో వేగం పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పనులు పూర్తి చేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకవచ్చేలా చర్యలు చేపడుతాం.

అసంపూర్తిగా సుద్దాల హెల్త్ సబ్‌సెంటర్ భవనం

సుల్తానాబాద్, జూలై 28: మండలంలోని సుద్దాల గ్రామంలో చేపట్టిన హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. రెండేళ్ల నుంచి ఈ భవనం పనులు నిలిచిపోవడం, పూర్తి చేయడానికి అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్తులు గ్రామపంచాయతీ ఆవరణలో పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పలు గ్రామాలలో ఉప ఆరోగ్య కేంద్రాలు ఉన్నచోట శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టారు. కొన్ని గ్రామాలలో భవన నిర్మాణాలు పూర్తికాగా సుద్దాలలో మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. దాంతో గ్రామంలో ప్రజలకు జ్వర పరీక్షలు ఇతర చికిత్సలు ఓపీ లాంటివి చూడడం ఇబ్బందికరంగా, అసౌకర్యంగా మారింది. గ్రామ పంచాయతీ పాత భవనం రెండు చిన్న గదులు ఉండగా ఒక రూంలో దానికి సంబంధించిన సామాన్లు ఉండగా, మరో రూంలో పంచాయతీ సెక్రెటరీ విధులు నిర్వహిస్తారు. అరుగు పైన ప్రస్తుతం ఆరోగ్య సిబ్బంది ఓపీలను నిర్వహిస్తుండడం వారం వారం, ఇచ్చే ఇంజక్షన్లు వేయడం, ఇతర వైద్య చికిత్సలు ఆ అరుగు మీదనే చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సుద్దాల మాజీ ఎంపీటీసీ సంకెనపల్లి లక్ష్మణ్ తోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రమాదంలో గాయపడిన కార్మికులకు

మెరుగైన వైద్యం అందించండి

గోదావరిఖని, జూలై 28: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే2 ఇంక్లైన్‌లో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సీఎంవోను ఆదేశించారు. సింగరేణిలో వరుస ప్రమాదాలు జరగడం బాధాకరమని, రక్షణ చర్యలను పటిష్టపరచాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రమాదానికి గల కారణాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆదివారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు.

కార్మికుల ప్రాణాలతో చెలగాటం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్


గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న చందర్

గోదావరిఖని, జూలై 28: సింగరేణి యాజమాన్యం కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని, ఉత్పత్తిపై చూపుతున్న శ్రద్ధను కార్మికుల రక్షణపై చూపడం లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. గని ప్రమాదంలో గాయపడిన కార్మికులను సింగరేణి ఆసుపత్రిలో ఆదివారం చందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గని ప్రమాదానికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన శంకర్, నోయల్‌ను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని, ప్రమాదం జరిగిన తీరును అడిగితెలుసుకున్నారు. గాయపడిన బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ మధ్య సింగరేణిలో జరుగుతున్న వరుస ప్రమాదాలతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని, ప్రమాదాలపై కనీస విచారణ కూడా లేదని చందర్ అన్నారు. కార్మికుల రక్షణలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా పని స్థలాల్లో సరైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ప్రమాదం జరుగుతుందని తెలిసినప్పటికీ కార్మికులపై ఒత్తిడి తెస్తూ పని చేయించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సింగరేణి అధికారులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవడానికి ఇలాంటి పనులు చేస్తున్నట్లు కనబడుతుందన్నారు. కార్మికుల సంక్షేమం, రక్షణ పట్ల యాజమాన్యానికి పట్టింపు లేకుండా పోయిందని ఆయన అన్నారు. కార్మికులను కాపాడడంలో భద్రత ప్రమాణాలు పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, జేవీ రాజు, వర్లపల్లి రవి, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, చెలుకలపెల్లి శ్రీనివాస్, శేషగిరి, కిరణ్‌జీ, మహేందర్, కనకరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ముత్తారం, జూలై 28: ముత్తారం మండలంలో నేషనల్ హైవే రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు ఒక్క ఎకరానికి రూ.20లక్షల నష్టపరిహారం చెల్లించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న నేషనల్ హైవే 163జి రోడ్డు నిర్మాణంలో భాగంగ ముత్తారం మండలంలో భూములు కోల్పోతున్న రైతులు ఐటీ పరిశ్రమలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ కోయా శ్రీహర్షతో శ్రీధర్‌బాబు ఫోన్‌లో మాట్లాడి మంథని, రామగిరి మండలాలకు సంబంధించిన రైతులకు చెల్లించే నష్టపరిహారం ముత్తారం మండలం రైతులకు అదే ధర చెల్లించాలని ఫోన్లో కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం,మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, మైనార్టీ మండలాధ్యక్షులు వాజీద్ పాషా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగమోహన్‌రెడ్డి, చాంద్ పాషా,జంగ మోహన్ రెడ్డి,దేశిని రాజేశం, ముత్తారం మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి, జూలై28: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టుకు పూర్తిస్థాయిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అర్హత కలిగిన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను సోమవారం నుంచి 3వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి ఆరెపెల్లి రాజయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు పాలకుర్తి మండలంలో నివసిస్తున్న పదవ తరగతి ఉత్తీర్ణత పొంది 18 సంవత్సరాలు నిండిన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. మహిళా అభ్యర్థులు తమ యొక్క బయోడేటా ఫారంతో పాటుగా ఆధార్, కులం, నివాసము, ధ్రువీకరణ పత్రాలతో పాటు 10 వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ జత చేసి కేజీబీవి మండల ప్రత్యేక అధికారికి ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల లోపు సమర్పించాలన్నారు. హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వ గుర్తింపు ఉన్న హాస్టల్, గురుకుల, రెజిడెంటల్ పాఠశాలలో వంట పని చేసిన అనుభవం గల వారై ఉండాలని ఎంఈవో రాజయ్య తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, జూలై 28 : మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు దాసరి ఉష, బండారి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్, జూలై 28: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2005-06 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా కలసి ఆదివారం గర్రెపల్లిలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకోగా అక్కడకు చేరిన మిత్రులంతా తోటి వారితో కలసి తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

హిందూవాహిని కార్యవర్గం

ఓదెల, జూలై 28 : మండలంలోని కనగర్తిలో ఆదివారం హిందూ వాహిని ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సంయోజక్ పెండం మణికంఠ, సాహస యోజక్ పెండం శ్రీనివాస్, వేల్పుల నాగేష్, తోట నితిన్ ఎన్నికయ్యారు .అలాగే ప్రధాన కార్యదర్శి వేల్పుల సాయి చరణ్, ప్రచారక్ కొట్టే వెంకటేష్, ఎన్నిక కాగా, ఈ కార్యక్రమంలో సంయోజక్ శాతాళ్ళ కుమార్, సహస యోజాక్ మేకల అనిల్, రామగిరి కృష్ణ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఓదెల, జూలై 28: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో వాచ్‌మెన్, చౌకిదార్ పోస్టులకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్ట ప్రతిపాదికన అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు సోమవారం నుంచి ఆగస్టు 3వరకు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. అభ్యర్థులు మండల నివాసులై ఉండాలని అలాగే 18 ఏళ్ల నిండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. కేవలం ఓసి మహిళలు బయోడేటా ఫారం తో పాటు ఆధార్, కులం, నివాసం, పదవ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, స్టడీ, కండక్ట్, సర్టిఫికెట్లను జత చేయాలని,అలాగే కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపు తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. వాచ్ మెన్ పోస్టుకు సెక్యూరిటీ ఏజెన్సీ లో శిక్షణ పొందిన అనుభవం ఉన్న వ్యక్తులు అర్హులని తెలిపిన సమయానికి దరఖాస్తులను అందజేయాలని ఎంఈఓ కోరారు.

ఈదునూరి శంకర్‌కు అవార్డు



కోల్‌సిటీటౌన్, జూలై 28: గోదావరిఖనికి చెందిన స్వచ్ఛంద యువజన సంఘాల నాయకుడు ఈదునూరి శంకర్ మరోసారి అరుదైన జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు శంకర్‌ను చేసినట్లు ఆలిండియా యూత్ ఫౌండేషన్ టీం జేనిత్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు డాక్టర్ మనీష్‌గవాయి, మీతిన్ కలాంబే ప్రకటించారు. ఆగస్టు 12న ఢిల్లీలో జరిగే నేషనల్ కల్చరల్ ఫెస్టివల్-2024 కార్యక్రమంలో శంకర్ అందుకో నున్నారు. ఈ మేరకు శంకర్ ఆహ్వానం పంపించారు. భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీహరిష్‌మల్హోత్రా, కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అదవాలే చేతుల మీదుగా శంకర్ అవార్డు అందుకోనున్నారు. కాగా శంకర్‌కు మరోసారి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బస్టాండ్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా తిరుపతి

కళ్యాణ్‌నగర్, జూలై 28: గోదావరిఖని బస్టాండ్ ఆటో యూనియన్ అధ్యక్షునిగా ఆసంపల్లి తిరుపతి ఎన్నికైనట్లు రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు కండె కృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆసంపల్లి తిరుపతికి 47ఓట్లు రాగా, కడార్ల శ్రీధర్‌కు 45ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా ఈర్ల సరయ్యను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో మధు, రహీం, ఎస్‌కే చోటు, షరీఫ్, సంపత్ పాల్గొన్నారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, జూలై 28: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యవర్గ సభ్యునిగా గోదావరిఖనికి చెందిన చల్లా రవీందర్‌రెడ్డిని, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా జనగామ తిరుపతిని ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ చెప్పారు. ఖమ్మంలో శని, ఆదివారాల్లో జరిగిన అయ్యప్ప ధర్మప్రచార సభలో వీరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ప్రతినిధులు వడ్డేపల్లి దినేష్, సురేష్‌కుమార్, రామస్వామి పాల్గొన్నారు.